క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే నేత కార్మికులకు న్యాయం

పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు రవికుమార్



వేం నరేందర్‌రెడ్డికి సమస్యలను వివరిస్తున్న రవికుమార్

పహాడీషరీఫ్: నేత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అన్ని విధాలా న్యాయం జరుగుతుందని ఆ పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మస్న రవికుమార్ అన్నారు. ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని బుధవారం రవికుమార్ ఆధ్వర్యంలో టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర కార్యవర్గం కలిసి చేనేత కార్మికుల సమస్యలను విన్నవించారు. చేనేత కార్పొరేషన్ చైర్మన్‌గా గూడూరు శ్రీనివాసులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చేనేత విభాగం నాయకులు శ్రీనివాసులు, నర్సింహారావు, సత్యసాయిబాబు, నరేందర్, లింగయ్య,శివ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 2024–25 సంవత్సరానికిగాను దోస్త్ (ఆన్‌లైన్) ద్వారా అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక తెలిపారు. ఉన్నత విద్యనభ్యసించే వారికి అన్ని సదుపాయాలతో బోధన నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బీఏ, బీకామ్, బీఎస్సీ డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో చదవాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన అభ్యర్థులు కళాశాల కోడ్ 12818తో దోస్త్ పోర్టర్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బుధవారం ఓ ప్రకటనలో ఆమె తెలిపారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్

కందుకూరు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం(ఈ నెల 28) చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ కార్మికులతో రాష్ట్ర ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటుందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల ను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తుందని విమర్శించారు. వెంటనే పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముట్టడికి పెద్ద ఎత్తున కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సీఐకి సత్కారం



సీఐని సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కందుకూరు: స్థానిక నూతన సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కె.సీతారామ్‌ను ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, అంబేడ్కర్ సంఘం నాయకులు కొమ్ముగళ్ల జంగయ్య, ఊటు జంగయ్య, టి. శేఖర్, కె.రాములు, కె.నరసింహ, జి.చెన్నారెడ్డి, కె.అశోక్, ఎడ్ల మహేష్, చందు, ఊటు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై డివైడర్ల ఏర్పాటు



రోడ్డుపై మట్టిని తొలగిస్తున్న సిబ్బంది, చిత్రంలో కమిషనర్ రఘు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని చెట్టోనిబాయి వద్దనున్న మూల మలుపు ప్రమాదకరంగా మారడంతో బుధవారం కమిషనర్ రఘు సిబ్బందితో డివైడర్లను ఏర్పాటు చేయించారు. గతంలో ఈ మలుపు వద్ద ట్రంక్ లైన్ నిర్మాణ పనులు రోడ్డు మధ్య నుంచి జరగగా వాహనదారులకు ఇబ్బంది పడ్డారు. పనులు పూర్తి కావడంతో జేసీబీతో రోడ్డును శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ రఘు మాట్లాడుతూ.. వాహనదారులు సకాలంలో గమ్య స్థానాన్ని చేరేలా రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విధులు సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ యాదగిరి, రాకేష్, రాజ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

ప్రారంభమైనా.. ఉపయోగం లేదు!



దావుత్‌ఖాన్‌గూడలో ఫంక్షన్ హాల్

పెండింగ్‌లో ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు

- ఎన్నికల వేళ హడావుడిగా రిబ్బన్ కట్
- లోపించిన నాణ్యతా ప్రమాణాలు
- అందుబాటులోకి తేవాలని స్థానికుల విజ్ఞప్తి

బడంగ్‌పేట్: ఎన్నికల వేళ హడావుడిగా ప్రారంభించిన ఫంక్షన్ హాల్ నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చినట్లు కన్పిస్తున్నాయి. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని దావుత్‌ఖాన్‌గూడలో ఎకరన్నర స్థలంలో గత ప్రభుత్వం కొత్త మున్సిపల్ కార్యాలయం ఎదుట మెయిన్‌రోడ్డు చౌరస్తా పక్కన ప్రజల సౌకర్యార్థం ప్రజాభవన్ (ఫంక్షన్‌హాల్) నిర్మించింది. అధికారికంగా ప్రారంభానికి నోచుకున్నా పనులు ఇంకా పూర్తి కాలేదు. సాధారణ ఎన్నికల కోడ్ రాబోతున్న తరుణంలో మున్సిపల్ కార్పొరేషన్ భవనంతో పాటు ప్రజా భవనాలు సైతం మంత్రి హోదాలో దాదాపు ఎనిమిది నెలల క్రితం సబితారెడ్డి ప్రారంభించారు. దీనికోసం రూ.మూడు కోట్లకు పైగా నిధులు వెచ్చించారు. పార్కింగ్‌తో పాటు వేయి మందికి సరిపోయేలా హాలు, డైనింగ్ సెంటర్‌ను, ఇతర సౌకర్యాలను అందులో ఉండేలా రూపొందించారు. ప్రణాళిక అద్భుతంగా ఉన్నా ఆచరణలో మాత్రం పేలవంగా ఉంది. ప్రారంభోత్సవానికి ముందే భవనంలో కొంత పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ భవనం ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికే బేస్‌మెంట్ కుంగిపోయింది. ఎన్నికలు ముగిసి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ ఇంకా పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో స్థానికులు ఎప్పుడు అందుబాటులోకి వస్తుందని ఎదురు చూస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా వదిలేసిన ఫంక్షన్ హాల్ మెట్లు

అప్పుల పాలు కావొద్దని..



ప్రస్తుతం పెళ్లిళ్లు చేయాలంటే తప్పనిసరిగా ఫంక్షన్ హాల్ కావాలి. రూ.లక్షలు ధారపోసి షాదీఖానాల్లో నిర్వహించి పేద, మధ్యతరగతి ప్రజలు అప్పుల్లో కూరుకుపోతున్నారు. వారిని దృష్టిలో పెట్టుకొని ఉచిత ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని చేపట్టాం. అందుబాటులోకి వస్తే బడంగ్‌పేట, మీర్‌పేట్ కార్పొరేషన్, వాటి పరిసరాల్లోని ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. భవనంలో పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం.

– పి.సబితారెడ్డి, ఎమ్మెల్యే, మహేశ్వరం

వేతనాలు అందక అవస్థలు

- పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలి
- పశు సంచార వైద్యశాల సిబ్బంది

కందుకూరు: పశు సంచార వైద్యశాలలో(1962 అంబులెన్స్) పనిచేసే సిబ్బందికి తక్షణమే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని స్థానిక వెటర్నరీ వైద్యుడు వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కందుకూరులో ఆయన మాట్లాడుతూ.. పశువులకు వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశు సంచార వైద్యశాలలో విధులు నిర్వర్తించే సిబ్బందికి సకాలంలో వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2017 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి నియోజకవర్గానికి ఒక 1962 అంబులెన్స్‌ను ప్రభుత్వం కేటాయించింది. అందులో డాక్టర్, అటెండర్, డ్రైవర్ విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా రైతులు 1962 నంబర్‌కు డయల్ చేస్తే అంబులెన్స్‌తో అక్కడికి వెళ్లి మూగజీవాలకు వైద్య సేవలందిస్తున్నారన్నారు. కానీ ప్రభుత్వం సిబ్బందికి ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. దీంతో 1962లో పని చేసే సిబ్బంది ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక అవస్థలు పడుతున్నారన్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది సాయికిరణ్, వెంకటేశ్ ఉన్నారు.



మాట్లాడుతున్న 1962 అంబులెన్స్ సిబ్బంది

చెరువు కట్టకు మరమ్మతులు చేయండి

- మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాయకులు వినతి

కందుకూరు: మండలంలోని కొత్తగూడ సున్నం చెరువు కట్టకు ఏర్పడ్డ పగుళ్లకు మరమ్మతులు చేపట్టాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓ సరితకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం కొత్తగూడ అధ్యక్షుడు తాళ్ల నరసింహాముదిరాజ్, డైరెక్టర్ తాళ్ల బాలేష్‌ముదిరాజ్ మాట్లాడారు. సున్నం చెరువు కట్టకు పగుళ్లు ఏర్పడ్డాయని, దీంతో పాటు కట్టపై ముళ్ల పొదలు మొలచి రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో చెరువు నిండితే కట్ట తెగే పరిస్థితి ఉందని, దాన్ని దృష్టిలో ఉంచుకుని కట్టను పటిష్టం చేయాలన్నారు. దీంతో అటు రైతులతో పాటు మత్స్యకారులకు మేలు జరుగుతుందన్నారు. అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. వారి వెంట ఆ సంఘం సభ్యులు శేఖర్, కృష్ణ, శ్రీశైలం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల మానవహారం

- మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు
- మత్తుపదార్థాల వాడకంతో కలిగే నష్టాలపై విద్యార్థులతో ర్యాలీ

మహేశ్వరం: యువత డ్రగ్స్, గంజాయి బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం మండల ఠాణా ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి వాడకం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులతో కలిసి అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయన్నారు. రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. శారీరక, మానసికంగా ఇబ్బందులు గురవుతారని తెలిపారు. డ్రగ్స్, గంజాయి వాడకంతో మెదడు దెబ్బతిని పక్షవాతం తలెత్తుతాయన్నారు. సమాజంలో గౌరవ మర్యాదలు కోల్పోతారని తెలిపారు. డ్రగ్స్, గంజాయి రహిత సమాజ నిర్మాణం కోసం అందరం సమష్టిగా కృషి చేయాలన్నారు. యువత, విద్యార్థులు మంచి మార్గంలో నడిచి శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకు ముందు మహేశ్వరం అంబేడ్కర్ చౌరస్తా విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకట్‌రెడ్డి, రవీందర్, వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే తప్పుడు ఆరోపణలు

కార్పొరేటర్ నరేంద్రకుమార్

మీర్‌పేట: తన ఎదుగుదలను చూసి ఓర్వలేకనే తప్పుడు ఆరోపణలతో కేసులు పెట్టారని మీర్‌పేట కార్పొరేషన్ 13వ డివిజన్ కార్పొరేటర్ మొక్క నరేందర్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లెలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆరేళ్లుగా వ్యాపార భాగస్వాములకు గతంలో తన లక్ష్మన్య ఎంటర్‌ప్రైజెస్ నుంచి వారికి పలు సందర్భాలలో రూ.లక్షల్లో నగదు ఇచ్చానని, తన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరినా ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. ఈ విషయమై గత సంవత్సరం మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు భాగస్వాములను రిమాండ్ చేశారన్నారు. ఇటీవల కొంగరకలాన్‌లో ఓ భూమి విషయమై చీటింగ్ కేసు తనపై నమోదు చేయడం కుట్రలో భాగం అన్నారు. తనపై తప్పుడు కేసులు పెట్టిన వారిపై పరువు నష్టం దావా వేస్తానని ఆయన తెలిపారు.

గొలుసు దొంగకు రిమాండ్

మీర్‌పేట: గొలుసు దొంగను మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. నగరంలోని ఫతేదర్వాజకు చెందిన మహ్మద్ ఒసామా(24) వృత్తిరీత్యా లేబర్. జల్సాలకు అలవాటు పడిన ఒసామా మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన అమీర్‌తో కలిసి చైన్‌స్నాచింగ్‌లు చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో బడంగ్‌పేట బాలాజీనగర్‌లో ఈ నెల 21న కిరాణాషాపులో ఉన్న మహిళ వద్దకు ఒసామా వెళ్లి ఆమె మెడలోని పుస్తెలతాడును తెంచేందుకు ప్రయత్నించగా విఫలం అయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం ఒసామాను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.10వేల నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

నేటి నుంచి ఉచిత వినికిడి పరీక్షలు

వనస్థలిపురం: వనస్థలిపురం పనామా డబుల్ రోడ్డులోని హియర్ వెల్ స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటు ఉచిత వినికిడి పరీక్షలు, చెవి మిషన్ ట్రయల్స్ నిర్వహిస్తామని డా.గంజి శ్రీలత తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు ఫోన్‌నం. 9703235513, 9985631926లో సంప్రదించాలన్నారు.

సైదాబాద్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు

సైదాబాద్: శాంతి భద్రతల పరిరక్షణ కోసం సైదాబాద్ ఠాణా పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేపడతామని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. ఇటీవల పాతబస్తీలో తరచూ నేరాలు చోటు చేసుకోవడం, డ్రగ్స్, గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే వార్తల నేపథ్యంలో మంగళవారం రాత్రి సైదాబాద్ పీఎస్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతమైన సింగరేణి కాలనీ సహా పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. రాత్రి వేళల్లో సంచరిస్తున్న వారిని ఆపి సోదాలు చేశారు. గుర్తింపు పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సోదాలు కొనసాగుతాయని, గుంపులుగా తిరిగే వారితో పాటు, నిర్ణీత సమయం తర్వాత కూడా షాపులు తెరిచి ఉంచిన వారిపై చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



మహేశ్వరం: మోడల్ స్కూల్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ఫీజుల నియంత్రణలో సర్కారు విఫలం

- ఏబీవీపీ మహేశ్వరం నగర కార్యదర్శి రాఘవేందర్

మహేశ్వరం: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ మహేశ్వరం నగర కార్యదర్శి జమాల్‌పూర్ రాఘవేందర్ పేర్కొన్నారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త బంద్‌లో భాగంగా మండలంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు విద్యార్థుల నుంచి రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చారన్నారు. కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలలో ఫీజులను నియంత్రించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యపై ప్రభుత్వం చిన్నచూపు



రాచులూరులో పాఠశాలను బంద్ చేసి విద్యార్థులతో ఏబీవీపీ నాయకులు

- ఏబీవీపీ కందుకూరు నగర కార్యదర్శి భానుప్రసాద్
- విద్యా సంస్థల బంద్ ప్రశాంతం

కందుకూరు: ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఏబీవీపీ నాయకులు పాఠశాలలను బంద్ చేయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కందుకూరు నగర కార్యదర్శి ఢిల్లీ భానుప్రసాద్ మాట్లాడుతూ.. విద్యారంగం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని విమర్శించారు. మద్యానికి మంత్రిని నియమించిన సీఎం విద్యకు మాత్రం ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. దీంతో విద్యాసంస్థలను పట్టించుకునే వారే లేరన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు విచ్చలవిడిగా ఫీజులు పెంచుకుని విద్యార్థుల కుటుంబాలను ఆర్థికంగా దెబ్బ తీస్తున్నాయన్నారు. అలాంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీఈఓ, ఎంఈఓ నియామకాలు వెంటనే చేపట్టాలని, మధ్యాహ్న భోజనంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ చేయాలని, నాణ్యతలేని ఆహారాన్ని అందిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం పేదలకు సీట్లు ఉచితంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు టి.మణికుమార్, అమరేందర్, ప్రకాష్, వంశీ, బన్ని, వినయ్, ప్రవీణ్, కిషోర్, శ్రీనివాస్, రాజు, అభి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాశీ విశ్వేశ్వరాలయ వార్షికోత్సవాలు

నాగోలు: డివిజన్ పరిధిలోని జైపురికాలనీలోని శివ పంచయతన కాశీ విశ్వేశ్వరాలయం సప్తమ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పూజల్లో ముఖ్య అతిథులుగా టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అనంతల రాజిరెడ్డి పాల్గొన్నారు. తూర్పటి చిరంజీవి,ఉప్పల సాయి తేజ, ఉప్పల సాయి కిరణ్, జైపురి కాలనీ అధ్యకుడు యాదగిరి, రమేశ్, మాధవి, మమత, ప్రసన్న, మీనా పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగిక దాడికి యత్నం.. నిందితుడి అరెస్ట్

నాగోలు: చిన్నారిపై ఓ యువకుడు లైంగిక దాడికి యత్నించిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎల్‌బీనగర్‌లోని సద్గురుకాలనీలో ఓ కుటుంబం నివాసముంటోంది. వీరికి చిన్నారి(4)ఉంది. ఇంటి కాంపౌండ్‌లోని మరో ఇంట్లో కట్టెల శ్రీకాంత్(27) తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. శ్రీకాంత్ జీహెచ్‌ఎంసీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం చిన్నారి బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. శ్రీకాంత్ బాత్‌రూమ్‌లోకి వెళ్లి చిన్నారిపై లైంగిక దాడికి యత్నించాడు. వెంటనే చిన్నారి ఏడవడంతో తల్లి బాత్‌రూమ్ వద్దకు పరుగెత్తింది. వెంటనే శ్రీకాంత్ తల్లిని తోసేసి పరారయ్యాడు.దీంతో తల్లిదండ్రులు కాలనీ వాసులు సహకారంతో బుధవారం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ శ్రీకాంత్‌పై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు శ్రీకాంత్ అరెస్టు చేసి అతనిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

నాగోలు: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు, సలహాలు, సూచనలు తెలుసుకొనేందుకు బండ్లగూడ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రమేష్ బుధవారం తెలిపారు. గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 9958224058 నంబర్‌కు ప్రయాణికులు ఫోన్ చేసి రవాణా పరమైన సమస్యలపై ఫిర్యాదులు చేయడంతో పాటు సూచనలు, సలహాలు ఇవ్వవచ్చని డీఎం పేర్కొన్నారు.

ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయం: సంరెడ్డి

సైదాబాద్: భారత దేశ చరిత్రలో ఎమర్జెన్సీ విధింపు ఒక చీకటి అధ్యాయమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సందర్భంగా సైదాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయించారన్నారు. పత్రికలకు సెన్సార్ విధించి ప్రశ్నించే మేధావులు, పాత్రికేయుల గొంతు నొక్కారని విమర్శించారు. ప్రస్తుతం నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తోందని అన్నారు. ఎమర్జెన్సీ సమయంలో జైలు పాలైన పలువురు నాయకులను ఈ సందర్భంగా సన్మానించారు.



ఎమర్జెన్సీ సమయంలో అరెస్టైన నాయకులను సన్మానించిన బీజేపీ నేతలు

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్లు జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మలక్‌పేట: మెట్రోపాలిటన్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి అరుణ కుమారి ఆధ్వర్యంలో బుధవారం అక్బర్‌బాగ్‌లోని మలక్‌పేట హైస్కూల్లో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ మలక్‌పేటలో డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు వినియోగించే వ్యక్తి శారీరకంగా, మానసికంగా కృంగి కృశించి పోతాడని, అందరికీ దూరమవడంతో పాటు భవిష్యత్ అంధకారమౌతుందన్నారు. మలక్‌పేట ఎస్‌ఐ నవీన్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.